# బంబార ప్రధాన రహదారికి 'డ్రెయిన్' దెబ్బ





జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
సోమవారం 24 ఆగస్టు 2026
పేజీలు : 8



# ఆలస్యమైనా.. పల్లె వెలుగుకే ప్రాధాన్యం

ఆదిలాబాద్ పట్టణానికి చెందిన రుక్మాబాయి, నవత తల్లీకూతుళ్లు. ఆదిలాబాద్ నుంచి కామారెడ్డికి వెళ్లాలి. అంతదూరం ఉచితంగా ప్రయాణించేందుకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు లేవు. సూపర్ డీలక్స్ బస్సులో నేరుగా వెళ్లవచ్చు. కానీ ఛార్జీలు చెల్లించాలి. దీంతో వారు ఎక్స్‌ప్రెస్ బస్సులో తొలుత నిర్మల్ వరకు వెళ్లి, అక్కడి నుంచి నేరుగా బస్సు ఉంటే కామారెడ్డికి.. లేదంటే ఆర్మూర్ బస్సు ఎక్కి అటు నుంచి కామారెడ్డికి చేరుకుంటామని పేర్కొన్నారు. ఉచిత ప్రయాణానికి మహిళలు ఎంత మొగ్గు చూపుతున్నారో చెప్పడానికి ఇదో ఉదాహరణ. ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మహిళా ప్రయాణికులతో కళకళలాడుతున్నాయి. మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో బస్సులు నిండిపోతున్నాయి. ఆలస్యమైనా సరే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం వేచి చూస్తున్నారు. దీంతో పగటిపూట సూపర్ లగ్జరీ, లహరి బస్సుల్లో అంతగా మహిళా ప్రయాణికులు కనిపించడం లేదు.

# స్మశానవాటికకు నూతన పైప్‌లైన్, వాటర్ ట్యాంక్

**సోన్, ఆగస్టు 23(ప్రజా జ్యోతి):** సోన్ మండలం కడ్తాల్ గ్రామం లోని స్మశానవాటిక వద్ద నీటి వసతి సరిగా లేక గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం లభించింది. స్మశాన వాటికలో అంత్యక్రియల సమయంలో స్నానాలు చేసేందుకు నీరు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ గుర్రం రాము దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల సమస్యపై వెంటనే స్పందించిన సర్పంచ్ స్మశానవాటిక వద్ద నూతన పైప్ లైన్ తో పాటు వాటర్ ట్యాంక్ ను ఏర్పాటు చేయించారు. గతంలో ఏర్పాటు చేసిన పైప్ లైన్, వాటర్ ట్యాంక్ పూర్తిగా దెబ్బతినడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో అంత్యక్రియల సమయంలో స్నానాలు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని నూతన పైప్ లైన్ ఏర్పాటు చేసి, వాటర్ ట్యాంక్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించిన సర్పంచ్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఎస్.ఐ. ఆర్. రెండో విడత ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వాములు అవ్వాలి



ఎమ్మెల్యే రామరావ్ పటేల్



**బాసర ఆగస్టు 23 (ప్రజా జ్యోతి)**ఎస్ ఐఆర్ రెండో విడత ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని ఎమ్మెల్యే రామరావ్ పటేల్ బిజెపి నాయకులకు కార్యకర్తలకు సూచించారు. ఆదివారం బైంసా పట్టణంలోని ఎస్ ఎస్ జిన్నింగ్ ఇండస్ట్రీలో బిజెపి బిఎల్ఎ 2 కార్యకర్తలచే ఎస్ ఐ ఆర్ పై రెండో విడత అసెంబ్లీ కార్యాశాల నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్ ప్రక్రియతో బోగస్ ఓట్లకు ఇక తావుండదని, రెండో విడతలో ఏమైనా అనుమానాలు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు. ఒకరికి ఒకచోట మాత్రమే ఓటు హక్కు కల్పించాల న్న ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. వలసదారులకు అడ్డుకట్ట వేసేందుకు, విదేశీయు లు చొరబడి ఇక్కడ ఉండకుండా చూడడానికి ఎస్. ఐ.ఆర్ ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం ఎస్. ఐ ఆర్ స్టేట్ కో కన్వీనర్ సంజర్ల శ్రీనివాస్ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్, సర్ జిల్లా ఇన్చార్ రావుల రామ్ నాథ్, ముధోల్ ఎస్. ఐ.ఆర్ ఇన్చార్జి పైడిపల్లి గంగాధర్, ఎస్ ఐ ఆర్ రెండో విడతలో చేపట్టాల్సిన అంశాలను వివరించారు.. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయ ణరెడ్డి,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నారెడ్డి రవి పాండే, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ తో పాటు మండల బిజెపి అధ్యక్షులు, సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# అమెరికా నిపుణుడితో విద్యార్థుల ఇంటరాక్టివ్ సెషన్



**మంచిర్యాల , 23, ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అమెరికా నుంచి విచ్చేసిన పవన్‌కుమార్ విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్ ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి పరిశ్రమ, వ్యాపార రంగాల్లోని ప్రస్తుత పరిస్థితులు, అవసరమైన నైపుణ్యాలు, భవిష్యత్ కెరీర్ అవకాశాలపై విలువైన అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ నాలెడ్జ్, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వ్యాపార రంగంలో ఉన్న అవకాశాలు, సంస్థలు ఉద్యోగుల నుంచి ఆశించే నైపుణ్యాలు, భవిష్యత్‌లో అందుబాటులో ఉండే వివిధ కెరీర్ మార్గాలపై ఆయన వివరించారు. ఈ ఇంటరాక్టివ్ సెషన్ విద్యార్థులకు వాస్తవిక అనుభవాల ఆధారంగా అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జిక్రన్ సయ్యద్, లలిత, మమతతో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# సెంటర్ కమిటీ పేరుతో అక్రమ వసూళ్లు చేస్తే చర్యలు

69 గ్రామాల ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి



**ఆసిఫాబాద్, ఆగస్టు 23:** సెంటర్ కమిటీ పేరుతో అనధికారికంగా డబ్బులు, వస్తువులు వసూలు చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సెంటర్ కమిటీ అధ్యక్షుడు మసాదే ప్రశాంత్ సూచిం చారు. ఈ మేరకు కమిటీ పరిధిలోని 69 గ్రామాల ప్రజలకు అధికా రిక ప్రకటన విడుదల చేశారు. సెంటర్ కమిటీ పరిధిలో ఎలాంటి అధికారిక హోదా, బాధ్యత లేని కొందరు వ్యక్తులు కమిటీ పేరును, అధ్యక్షుడి పేరును ఉపయోగించి వివిధ దుకాణాలు, వ్యాపార సంస్థలు, వ్యక్తుల నుంచి డబ్బులు లేదా వస్తువులు వసూలు చేస్తున్న ట్లు సమాచారం అందిందన్నారు. ఇటువంటి చర్యలు కమిటీ నియమ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. కమిటీ పేరును దుర్వినియోగం చేయడం, అధ్యక్షుడి పేరును అనధికారికంగా ఉపయోగించడం, అనుమతి లేకుండా డబ్బులు, వస్తువులు వసూలు చేయడం క్రమశిక్షణా ఉల్లంఘనగా పరిగణిస్తామని తెలిపారు. ఎవరైనా ఇలాంటి వ్యక్తులు వసూళ్లకు వస్తే వారికి డబ్బులు, వస్తువు లు ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలు, వ్యాపారులు, దుకాణదారులకు సూచించారు. అనధికారిక వసూళ్లకు పాల్పడుతు న్నట్లు గుర్తించిన వారిపై కమిటీ నియమావళి ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని మసాదే ప్రశాంత్ హెచ్చరించారు.

## పాప హరీశ్వరునికి ప్రత్యేక పూజలు



**బాసర ఆగస్టు 23 (ప్రజాజ్యోతి)**బాసర ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ పాపహరేశ్వర ఆలయంలో ఆదివారం శ్రావణమాసం ఏకాదశి సందర్భంగా స్వామివారికి అర్చకులు నాగేష్ అప్ప ఆధ్వర్యంలో రుద్రాభిషేకం,అన్నపూజ, హర్చన,హారతి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులందరికీ అన్న దానం నిర్వహించారు సోమ వారం రోజు శ్రీ పాప హరేశ్వర నూతన ఆలయ కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్,వీడిసి అధ్యక్షుడు లింగారావు ఒక ప్రకటనలో తెలిపారు.ఇట్టి కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## సింగరేణిలో మారు పేర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలి

సింగరేణి యాజమాన్యానికి విశ్రాంత ఉద్యోగుల సంఘం




**మంచిర్యాల, 23, ఆగస్టు (ప్రజాజ్యోతి):** సింగరేణి కంపెనీలో గత కొన్ని సంవత్సరాలుగా కార్మికులు ఎదుర్కొంటున్న మారు పేర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, సింగరేణిలో అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహించిన ఉద్యోగుల పేర్లలో ఉన్న మారు పేర్ల కారణంగా ఉద్యోగ సంబంధిత హక్కులు, వారసత్వం, కారుణ్య నియామకాలు, సర్వీస్ ప్రయోజనాలు, ఇతర సంక్షేమ పథకాల విషయంలో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఉద్యోగి నిరంతర సేవా రికార్డులు, సర్వీస్ వివరాలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిగణనలోకి తీసుకొని మానవతా దృక్పథంతో మారు పేర్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించి బాధిత కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని సింగరేణి సీఎండీ బి. ప్రకాష్ జ్యోతి, డైరెక్టర్లకు సమావేశం లో విజ్ఞప్తి చేశారు .ఈ సమావేశంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, ఉపాధ్యక్షులు ఏ. గంగన్న, ఎన్. సదాశివ, బుర్ర జ్ఞాని, సలహాదారు ఎం. అంజయ్య, ఎం. సత్యనారాయణరావు, కార్యదర్శి కాటం లక్ష్మణ్, నాయకులు గుజ్జ చందు, గజెల్లి సుధాకర్, జి. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం "సింగరేణి విశ్రాంత ఉద్యోగులారా ఏకం కండి" "సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం వర్ధిల్లాలి""సింగరేణి అమరవీరులకు జోహార్లు", "జై సింగరేణి", "జై తెలంగాణ" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## టైగర్ జోన్ రద్దు చేయాలి-ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలి

**రిలే నిరాహారదీక్ష చేపట్టిన భూమాచారి**



**జన్నారం,ఆగస్ట్23(ప్రజాజ్యోతి)** జన్నారం డివిజన్ లోని కవ్వాల్ టైగర్ జోన్ రద్దు చేయాలని, ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక పోరాట సమితి మండల అధ్యక్షుడు శ్రీరాముల భూమాచారి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ రిలే నిరాహారదీక్ష కు మండల వర్తక వ్యాపారులు, పలు పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు, కుల సంఘాలు, పలువురు సర్పంచులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భూమాచారి మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ ఆంక్షలు ఎత్తివేయడం కాదు పూర్తిగా కవ్వాల్ టైగర్ జోన్ ను ఎత్తివేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ పేరుతో జన్నారం రేంజిలో సస్పెండ్ చేసిన అటవీ శాఖ ఉద్యోగులను విధుల్లో చేర్చుకొని సర్వీసులో ఎలాంటి మరకలు లేకుండా పూర్తి జీతం చెల్లించాలని కోరారు. గుడిహత్నూర్ నుండి జన్నారం మీదుగా కరీంనగర్ వరకు నాలుగు వరుసల జాతీయ రహదారిని వెంటనే ఏర్పాటు చేయాలని, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ పై అటవీశాఖ అధికారులు పెట్టిన కేసులు బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ ఎత్తివేసే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుందని, 41 రోజుల తర్వాత టైగర్ జోన్ ఎత్తివేయక పోతే ఆమరణ నిరాహారదీక్ష చేపడతారని హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షకు మండలవాసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

## మంచిర్యాలలో కాంగ్రెస్ లొల్లి పేరుతో అసత్య ప్రచారం తగదు

**6వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి మేకల అశ్విని ఏ వర్గంలో చేరలేదు**

**సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్**

**మంచిర్యాల, ఆగస్టు 23 ( ప్రజాజ్యోతి):** మంచిర్యాలలో కాంగ్రెస్‌లో లొల్లి అంటూ ఓ పత్రికలో (ప్రజాజ్యోతి కాదు ) ప్రచురితమైన కథనంలో 6వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మేకల అశ్విని ఒక రాజకీయ వర్గంలో చేరినట్లు పేర్కొనడం పూర్తిగా అవాస్తవమని, ఆ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తెలిపారు. వ్యక్తిగత పోకడలు, స్వప్రయోజనాల కోసం రాజకీయంగా నిబద్ధతతో పనిచేస్తున్న వ్యక్తులపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. మేకల అశ్విని ఎలాంటి రాజకీయ వర్గ మార్పులకు పాల్పడలేదని, కమ్యూనిస్టు పార్టీ పట్ల నిబద్ధతతో, సిద్ధాంతపరమైన విలువలకు కట్టుబడి పనిచేస్తున్నారని రామడుగు లక్ష్మణ్ స్పష్టం చేశారు. వాస్తవాలను నిర్ధారించకోకుండా వ్యక్తుల పేర్లను రాజకీయ వర్గాలతో ముడిపెట్టి వార్తలు రాయడం సరికాదన్నారు. "బూర్జువా సంస్కృతిని కమ్యూనిస్టులకు అంటకట్టవద్దు. మేము నిలకడగా, నిబద్ధతతో పనిచేసే వాళ్లం" అని ఆయన అన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, నాయకులు పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం తమ రాజకీయ విధానాలను మార్చుకునే వారు కాదని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ సిద్ధాంతపరంగా ముందుకు సాగుతారని తెలిపారు. ఎవరైనా కావాలని తప్పుడు సమాచారం ఇచ్చినా, వాస్తవాలను తెలుసుకోకుండా ప్రచురించినా అది "సూర్యుడిపై ఉమ్మివేయడానికి ప్రయత్నించినట్టే" అవుతుందని, ఇలాంటి తప్పుడు ప్రచారాలతో కమ్యూనిస్టుల నిబద్ధతను దెబ్బతీయలేరని రామడుగు లక్ష్మణ్ అన్నారు. పత్రికలో ప్రచురితమైన సదరు కథనంలోని తప్పుడు సమాచారాన్ని వెంటనే సరిదిద్ది, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆటో డ్రైవర్ల బందుకు ఎంసీపీఐయూ సంపూర్ణ మద్దతు

## ఆటో డ్రైవర్లకు ఎన్నికల హామీలను అమలు చేయాలి

### ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి పసులేటి వెంకటేష్



**మంచిర్యాల , 23, ఆగస్టు (ప్రజాజ్యోతి):** రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఆదివారం అర్ధరాత్రి నుంచి చేపట్టనున్న బందుకు ఎంసీపీఐయూ పార్టీ, అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం (ఏఐసీటీయూ) సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఆటో డ్రైవర్లకు ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం ఎంసీపీఐయూ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఎనిమిది లక్షల మంది ఆటో డ్రైవర్లు ఆటో వృత్తినే ప్రధాన జీవనాధారంగా చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని వెంకటేష్ ఆరోపించారు. ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా అన్యాయం చేసిందని విమర్శించారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆటో డ్రైవర్లు చేపడుతున్న సమ్మె న్యాయమైనదని, వారి పోరాటానికి ఎంసీపీఐయూ పార్టీ, ఏఐసీటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తున్నాయని స్పష్టం చేశారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా సంవత్సరానికి రూ. 12 వేల జీవనభృతిని అందించాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఆటో కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం రూ. 1,000 కోట్లతో ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్ ఆధారిత సేవల కారణంగా ఆటో కార్మికుల ఉపాధికి నష్టం కలుగుతోందని, వాటిని వెంటనే నిషేధించాలని వెంకటేష్ కోరారు. ఆటో డ్రైవర్లకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, ప్రతి ప్రాంతంలో ఆటో స్టాండ్లు, ఆటో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు చేపట్టిన బందుకు ఎంసీపీఐయూ పార్టీ, దాని కార్మిక సంఘాలు అండగా నిలుస్తాయని వెంకటేష్ తెలిపారు. ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం వారి పోరాటాల్లో భాగస్వాములవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, బెల్లంపల్లి మండల కార్యదర్శి ఆరేపల్లి సతీష్, తొగరి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# మనుషులు గతంలోని చేదు అనుభవాలను మరచి భవిష్యత్తు వైపు ముందుకు సాగాలి

## ఘనంగా జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆగస్టు మాస రెండవ సమావేశం




**మంచిర్యాల, 23, ఆగస్టు (ప్రజాజ్యోతి):** జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆగస్టు మాస రెండవ సమావేశం ను ఆదివారం మంచిర్యాల పట్టణంలోని జన్మభూమి నగర్‌లో గల జ్యోతిబాపూలే సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవిసమ్మేళనంలో పలువురు కవులు సామాజిక అంశాలపై తమ కవితలను వినిపించారు. అధ్యక్షోపన్యాసంలో ఇటీవల నిర్వహించిన శతావధాన కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన కవిమిత్రులు, సాహిత్యాభిమానులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జరిగిన కవిసమ్మేళనంలో గోపగాని రవీందర్ తన కవిత ద్వారా "నదులు ఎప్పుడూ ముందుకే పారుతాయి" అనే భావాన్ని వివరిస్తూ, మనుషులు గతంలోని చేదు అనుభవాలను మరచి భవిష్యత్తు వైపు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మేసు మల్లేశం ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా కవిత్వం, జనహితం, మానవ జీవితంలో సృజనాత్మకత భాగం కావాలని ఆకాంక్షిస్తూ తన కవితను వినిపించారు. అల్లాడి శ్రీనివాస్ తన కవితలో ప్రతి ఒక్కరూ తమ శక్తి మేరకు ముందుకు సాగాలని, ఇతరులు తప్పు చేశారని తాము కూడా తప్పు చేయడం సరికాదనే సందేశాన్ని అందించారు. దండనాయకుల వామన్‌రావు ఇటీవల జరిగిన ఉపాధ్యాయిని రూపారెడ్డి హత్య ఘటనపై స్పందిస్తూ కవితను వినిపించారు. గురువుల ఆవేదనను విద్యార్థులు అర్థం చేసుకోవాలని, తమ భవిష్యత్ జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. నేరచరితులుగా మారి పసి జీవితాలను నాశనం చేసుకోవద్దని తన కవిత ద్వారా విద్యార్థులకు పిలుపునిచ్చారు. కవిసమ్మేళనానికి విచ్చేసిన కవులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ కార్యక్రమాన్ని ముగించారు. జిల్లా సాహితీ సంరక్షణ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దండ నాయకుల వామన్ రావు, అల్లాడి శ్రీనివాస్ లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# యువశక్తి మాటలు కాదు.. యువతకు ఉద్యోగాలు కావాలి

**ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ ఆపాలి.. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలి**

**కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచిర్యాలలో ఘనంగా ఏఐవైఎఫ్ జిల్లా 3వ మహాసభ**

**మంచిర్యాల, 23, ఆగస్టు (ప్రజాజ్యోతి):** దేశ యువతను "యువశక్తి" అంటూ ప్రసంగాల్లో పొగడటం కాకుండా, వారికి శాశ్వత ఉపాధి, నాణ్యమైన విద్య, సామాజిక భద్రత, ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు కల్పించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ మంచిర్యాల జిల్లా 3వ మహాసభ సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. మహాసభల ముందు యువజన ప్రదర్శన, జెండాలు చేతబూని, విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధనకై పోరాడుదామని, ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాలు ఇస్తూ ప్రదర్శన జరిగింది. మహాసభల సూచికంగా యువజన సంఘ జెండాను మాజీ యువజన నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర. మాట్లాడుతూ, ఒకవైపు యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో శిక్షణ కార్యక్రమాలు ప్రకటిస్తూ, మరోవైపు ప్రభుత్వ ఉద్యోగాల అవకాశాలను తగ్గించడం, ప్రైవేటీకరణ కాంట్రాక్టీకరణను పెంచడం ద్వారా యువత భవిష్యత్తును అనిశ్చితి లోకి నెట్టడం ఆపాలని వారు కేంద్ర ప్రభుత్వంను డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అను సంధానంపై అనేక ప్రకటనలు చేసినప్పటికీ, శిక్షణతో పాటు శాశ్వత ఉద్యోగం ఎక్కడ? అనే ప్రశ్నకు కేంద్రం స్పష్టమైన సమాధా నం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మంచిర్యాల వంటి బొగ్గు, విద్యుత్, వ్యవసాయం, పారిశ్రామిక వనరులు ఉన్న జిల్లాలో స్థానిక యువతకు తగిన స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సింగరేణి, జైపూర్ విద్యుత్ కేంద్రం, సిమెంట్, సిరామిక్స్, వ్యవసాయ ఆధారిత రంగాలు ఉన్నప్ప టికీ, స్థానిక యువతకు మరిన్ని నైపుణ్య ఉపాధి అవకాశాలు, కొత్త పరిశ్రమలు, విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. మంచిర్యాల యువతకు ఉద్యోగాలు,




విద్యార్థులకు నాణ్యమైన విద్య, స్థానిక వనరులతో పరిశ్రమలు, ప్రభుత్వ రంగ పరిరక్షణ అనే డిమాండ్లతో ఏఐవైఎఫ్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని వారు స్పష్టం చేశారు. యువతను కేవలం ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా చూడకుండా, దేశ ఆర్థిక--సామాజిక అభివృద్ధిలో నిర్ణయాత్మక శక్తిగా గుర్తించి ఉద్యోగ హక్కును ప్రభుత్వ విధానంలో కేంద్ర అంశంగా మార్చాల న్నారు. అలాగే సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని, యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్. మాట్లాడుతూ, నేటి యువత కేవలం ఉద్యోగం సాధించడం మాత్రమే కాకుండా, సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకునే సైద్ధాంతిక అవగాహన కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. "శాంతి,అభ్యుదయం, శాస్త్రీయ సోషలిజం" అనే ఏఐవైఎఫ్ సిద్ధాంతాన్ని యువతలో విస్తృతంగా తీసుకెళ్లి, ప్రజా సమస్యలపై చైతన్యం పెంపొందిస్తూ ఉద్యమాలను బలోపేతం చేయాలన్నారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐవైఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు కరకూరి నరేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ మహేష్, ఆంథోని దినేష్, రామడుగు వంశీ, దుర్గరావు, హచ్చే హరీష్, మొగురం రాకేష్, ఉప్పులేటి తిరుపతి, లవన్ లతో పాటు 50మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# నత్తనడకన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవన నిర్మాణ పనులు

**వర్షాకాలంలో కామన్ పల్లి గ్రామస్థుల అవస్థలు**



**జన్నారం,ఆగస్ట్23(ప్రజాజ్యోతి)** జన్నారం మండలంలోని కామన్ పల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం అరకొర పనులతో మూలనపడటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారు.కొత్త భవనం పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా స్థానిక అధికారుల,కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి.? ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామంలో సీజనల్ వ్యాధులు,డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఆరోగ్య కేంద్రం అందుబాటులో లేకపోవడంతో చిన్నపాటి వైద్య సేవలకు కూడా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతూ,కిలోమీటర్ల దూరంలో ఉన్న జన్నారం మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లడం గర్భవతులకు, వృద్ధులకు నరకప్రాయంగా మారింది. గ్రామ ప్రజల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని స్థానిక నాయకులు,సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.నిలిచిపోయిన ఆరోగ్య కేంద్రం పనులను వేగవంతం చేసి,భవనాన్ని త్వరితగతిన ప్రారంభించి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని కామన్ పల్లి సర్పంచ్ పెరం శ్రీనివాస్, గ్రామస్థులు కోరుతున్నారు.

# తెలంగాణ రాష్ట్ర వ్యాప్త నిరవధిక ఆటో బంద్‌కు హెచ్ఎంఎస్ సంపూర్ణ మద్దతు

**ఆటో డ్రైవర్ల 15 న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలి**

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలి**

**ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కాపాడాలి**

**హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్**

**మంచిర్యాల, 23, ఆగస్టు (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల న్యాయమైన 15 డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న నిరవధిక ఆటో బంద్‌కు హెచ్ఎంఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారితో చర్చలు జరిపి న్యాయం చేయాలని హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ ఆదివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని లక్షలాది మంది ఆటో డ్రైవర్లు ఆటోలు నడుపుతూ తమ కుటుంబాలను పోషించుకోవ డంతో పాటు ప్రజలకు రవాణా సేవలు అందిస్తున్నారని, అయితే ప్రస్తుతం వారు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరుగుతున్న ఖర్చులు, ఆదాయం తగ్గడం, యాప్ ఆధారిత రవాణా సేవల విస్తరణ వంటి కారణాలతో ఆటో డ్రైవర్ల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. ఆటో డ్రైవర్ల 15 న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్ల సంక్షేమానికి పలు హామీలు ఇచ్చిందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇకపై ఆలస్యం చేయకుండా తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా రాపిడో, ఓలా, ఉబర్ వంటి యాప్ ఆధారిత సంస్థలు టూ వీలర్ల ద్వారా ప్రయాణికుల రవాణా సేవలను నిర్వహిస్తూ వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. టూ వీలర్లను ప్రయాణికుల రవాణా కోసం వాణిజ్యపరంగా వినియోగించేందుకు రాష్ట్ర రవాణా శాఖ నిబంధనలు, అనుమతులు ఏమిటో ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని అన్నారు. అవసరమైన అనుమతులు లేకుండా లేదా రవాణా నిబంధనలకు విరుద్ధంగా టూ



వీలర్లతో ప్రయాణికుల రవాణా నిర్వహిస్తున్న సంస్థలు, వాహనాలపై చట్టప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాప్ ఆధారిత టూ వీలర్ రవాణా సేవల కారణంగా సంప్రదాయ ఆటో డ్రైవర్లకు ప్రయాణికులు తగ్గి వారి ఆదాయంపై ప్రభావం పడుతోందని, ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కాపాడే విధంగా ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలని కోరారు. ఆటో డ్రైవర్ల 15 డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి, ఆటో జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని హెచ్ఎంఎస్ డిమాండ్ చేసింది. ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు హెచ్ఎంఎస్ వారికి అండగా ఉంటుందని, ప్రభుత్వం డిమాండ్లను అమలు చేసే వరకు వారి పోరాటానికి చివరి వరకు మద్దతుగా నిలుస్తామని నరెడ్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# సరండి రహదారికి గుంతల శాపం..!

## మంజూరైందంటున్నారు.. కానీ పనుల జాడేది?

## వర్షానికి రహదారి రూపురేఖలు మారుతున్నా పట్టించుకునే వారేరీ?

## ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్న గుంతల రహదారి





**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు 23 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామ పంచాయతీ ప్రధాన రహదారి సమస్యకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందోనని గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. ఒకప్పుడు గ్రామానికి ప్రధాన రాకపోకల మార్గంగా ఉన్న ఈ రహదారి ప్రస్తుతం గుంతలు, కంకర, బురదతో అధ్వానంగా మారింది. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతుండటంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పరిస్థితి చూస్తే అభివృద్ధి పనులు జరుగుతున్నాయా.. లేక రహదారి నిర్లక్ష్యానికి గురవుతోందా అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. రహదారిపై ఏర్పడిన గుంతలు రోజురోజుకు పెద్దవవుతున్నా సంబంధిత అధికారులు శాశ్వత చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**రహదారి కాదు.. గుంతల బాట**

సరండి ప్రధాన రహదారిపై పలుచోట్ల తారు పూర్తిగా కొట్టుకుపోయింది. రోడ్డు మధ్యలోనే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ఉండటంతో వాహనదారులు వాటిని తప్పించుకుంటూ ప్రయాణించాల్సి వస్తోంది. గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాటి లోతు కనిపించకపోవడం మరింత ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనదారులు ఒక గుంతను తప్పించుకునేలోపే మరో గుంత ఎదురవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఎదురుగా వాహనం వస్తే రహదారిపై పక్కకు వెళ్లే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వాహనాలతో పాటు ఆటోలు, సరుకు రవాణా వాహనాలు కూడా ఈ మార్గంలో ఇబ్బందులతోనే రాకపోకలు సాగిస్తున్నాయి.

**వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణం**

వర్షాకాలం కావడంతో రహదారి సమస్య తీవ్రత మరింత పెరిగింది. రోడ్డు పక్కన నీరు నిలవడంతో పాటు గుంతల్లో నీరు చేరుతోంది. దీంతో వాహనదారులకు రహదారి పరిస్థితి అర్థం కాకుండా పోతోంది. రాత్రి వేళల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. విద్యార్థులు, రైతులు, కూలీలు, ఉద్యోగులు, అత్యవసర సేవల కోసం ప్రయాణించే వారు ప్రతిరోజూ ఈ రహదారిని ఉపయోగిస్తున్నారు. రహదారి దుస్థితి కారణంగా ప్రయాణ సమయం పెరగడంతో పాటు వాహనాలపై అదనపు భారం పడుతోందని వాహనదారులు అంటున్నారు.

**రైతులకు తప్పని తిప్పలు**

సరండి పరిసర ప్రాంతాల్లో వ్యవసాయమే ప్రధాన ఆధారం. రైతులు తమ పంటలను పొలాల నుంచి మార్కెట్లకు తరలించేందుకు వాహనాలను వినియోగిస్తారు. అయితే రహదారి అధ్వానంగా ఉండటంతో పంటల రవాణా కూడా కష్టంగా మారుతోంది. వర్షాల సమయంలో ట్రాక్టర్లు, ఇతర వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని రైతులు పేర్కొంటున్నారు. పంటను సకాలంలో తరలించలేకపోతే రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ రహదారి బాగుండటం వ్యవసాయానికి కూడా ఎంతో అవసరమని, అందుకే అధికారులు ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

**మంజూరు మాటలకేనా?**

రహదారి నిర్మాణానికి మంజూరు లభించిందనే సమాచారం కొంతకాలంగా వినిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు మాత్రం కనిపించడం లేదని గ్రామస్తులు అంటున్నారు. మంజూరు జరిగి ఉంటే పనులు ఎందుకు ప్రారంభం కాలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు రహదారి పనులకు నిధులు ఎంత మంజూరయ్యాయి? టెండర్ ప్రక్రియ పూర్తయిందా? పనులు చేపట్టే సంస్థ ఎవరు? పనులు ఎప్పటి నుంచి ప్రారంభం కానున్నాయి? వంటి వివరాలను అధికారులు ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

**పనుల కోసం ఎదురుచూపులు**

ప్రతి వర్షాకాలంలో రహదారి మరింత దెబ్బతింటుండటంతో గ్రామస్తుల ఇబ్బందులు పెరుగుతున్నాయి. ఒకసారి రహదారి నిర్మాణం పూర్తయితే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు. కానీ పనులు ఆలస్యం అవుతున్న కొద్దీ ఆ ఆశలు నిరాశగా మారుతున్నాయని అంటున్నారు. మంజూరైన పనులు కేవలం ఫైళ్లలోనే ఉండకుండా నేలపై కనిపించాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పనుల పురోగతిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రమాదం జరిగాక స్పందించొద్దు**

రహదారిపై గుంతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలు జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నందున తాత్కాలికంగా అయినా గుంతలను పూడ్చి రహదారిని ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సమస్యను గుర్తించి పరిష్కరించడం అధికారుల బాధ్యత అని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

**ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పేదెవరు?**

రహదారి మంజూరైందని సమాచారం ఉన్నప్పటికీ పనులు ఎందుకు ప్రారంభం కాలేదో ప్రజలకు తెలియడం లేదు. రహదారి పనులపై అధికారికంగా ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో అనేక అనుమానాలు, ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారి పనుల స్థితిగతులపై ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. పనులు మంజూరైనట్లయితే ఆలస్యం లేకుండా ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**సరండి రహదారి బాగుపడితేనే గ్రామ అభివృద్ధికి వేగం**

గ్రామానికి ప్రధాన రాకపోకల మార్గమైన ఈ రహదారి సక్రమంగా ఉంటేనే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. రైతులు తమ ఉత్పత్తులను సులభంగా తరలించగలరు. విద్యార్థులు, ఉద్యోగులు సకాలంలో తమ గమ్యస్థానాలకు చేరుకోగలరు. అత్యవసర సమయంలో అంబులెన్స్, ఇతర వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బంది ఉండదు. అందువల్ల సరండి ప్రధాన రహదారిని కేవలం రోడ్డు సమస్యగా కాకుండా గ్రామ ప్రజల ప్రాథమిక అవసరంగా గుర్తించి అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇకనైనా గుంతల బాటకు ముగింపు పలికి.. మంజూరైన రహదారి పనులను వెంటనే ప్రారంభించి.. సరండి ప్రజలకు సురక్షితమైన ప్రయాణ మార్గాన్ని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కానర్‌గాం లో విద్యుత్ సౌకర్యాల మెరుగుదల

**ట్రాన్స్‌ఫార్మర్, 12 విద్యుత్ స్తంభాలు మంజూరు**

**ఉపసర్పంచ్ జీవన్**



**ఆసిఫాబాద్ , ఆగస్టు 23ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి కానర్ గాం గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపట్టినట్లు ఉపసర్పంచ్ జీవన్ తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు 1బ 2 విద్యుత్ స్తంభాలు మంజూరు చేయించి ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. అలాగే కానర్‌గాం నుంచి ఎల్సీ (లైన్ క్లియరెన్స్) సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సౌకర్యాలు మెరుగుపడటంతో గ్రామ ప్రజలకు విద్యుత్ అంతరాయాల సమస్యలు తగ్గనున్నాయ ని అన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు జీవన్ పేర్కొన్నారు. విద్యుత్ సౌకర్యాల ఏర్పాటుకు సహకరించిన విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


## పెళ్లి మండపంలో 'దత్తన్న కానుక' అందజేత



**సిరికొండ, ఆగస్టు 23 (ప్రజా జ్యోతి)**సిరికొండ మండల కేంద్రంలో సర్పంచ్ బొడ్డు దత్తాత్రేయ తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నారు. మండలంలో ప్రతి ఆడబిడ్డ వివాహానికి రూ. 5,000 ఆర్థిక సాయం అందిస్తానని చెప్పిన మాట ప్రకారం కానుకలు అందజేస్తున్నారు.ఆదివారం మండల కేంద్రానికి చెందిన సూర నారాయణ – లక్ష్మి దంపతుల కుమార్తె వివాహ వేడుక కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ బొడ్డు దత్తాత్రేయ, ఉప సర్పంచ్ తోకల రాజు నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం 'దత్తన్న కానుక' కింద రూ. 5,000 నగదును పెళ్లి మండపంలో వధువుకు అందజేశారు. వధువు తల్లిదండ్రులు సర్పంచ్ దత్తాత్రేయకు ధన్యవాదములు చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షేక్ బషీర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, మైనార్టీ చైర్మన్ రంజాని, సిరికొండ సిరిసంపద సొసైటీ చైర్మన్ గోర్బండ్ ప్రకాష్, సొసైటీ డైరెక్టర్ ప్రకాష్, వార్డు సభ్యులు రామారావు, ముక్రం, శ్రీనివాస్, సత్తి, అస్గర్, భూమన్న, ఎల్లన్న, సురేష్, రాజేష్, తిరుపతి, రాములు తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# బయటకు రాని బతుకులు ఎన్నో..!

## అందని ప్రభుత్వ పథకాలు.. ప్రశ్నిస్తే ఒత్తిళ్లు.. దిక్కుతోచని స్థితిలో నిరుపేదలు






**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు 23 (ప్రజాజ్యోతి):**ప్రభుత్వ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో అమలు చేస్తున్నామని పాలకులు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం అర్హులైన ప్రతి నిరుపేదకు ఆ పథకాల ఫలాలు అందుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ.. దరఖాస్తులు చేసుకుంటూ.. తమ వంతు ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూస్తున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయనే చర్చ స్థానికంగా సాగుతోంది. ఒకవైపు పేదరికం.. మరోవైపు పెరుగుతున్న నిత్యావసర ధరలు.. ఇంకోవైపు ఉపాధి అవకాశాల కొరత.. వీటన్నింటి మధ్య నిరుపేద కుటుంబాలు నెట్టుకొస్తున్నాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వం నుంచి అందే చిన్నపాటి సాయం కూడా వారికి ఎంతో పెద్ద ఊరటనిస్తుంది. కానీ ఆ సాయం అందకపోతే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది.

**కాగితాలపై పథకాలు.. గడప దాటని ప్రయోజనాలు?**

ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రకటిస్తోంది. అర్హులైన వారికి ఇళ్లు, పింఛన్లు, రేషన్, ఉపాధి, రైతు సంక్షేమం, ఇతర ఆర్థిక సహాయాలు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అయితే గ్రామస్థాయిలో అర్హుల ఎంపిక, దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల జాబితాల రూపకల్పనలో పారదర్శకత ఉండాలని ప్రజలు కోరుతున్నారు. అర్హత ఉంటే చాలు.. పథకం రావాలి అనే పరిస్థితి ఉండాలి కానీ.. ఎవరిని కలిశారు? ఎవరి సిఫారసు ఉంది? ఎవరి వెనుక రాజకీయ బలం ఉంది? అనే చర్చలకు తావుండకూడదని ప్రజలు అంటున్నారు.

**అర్హులైన పేదలు మిగిలిపోతే..**

ఇల్లు లేని నిరుపేద కుటుంబం ప్రభుత్వ ఇంటి కోసం ఆశగా ఎదురుచూస్తోంది. వృద్ధులు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. కూలీ కుటుంబాలు ఉపాధి కోసం చూస్తున్నాయి. చిన్న రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఆశిస్తున్నారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోతే వారు ఎవరిని ఆశ్రయించాలి? అన్నది ప్రశ్నగా మారుతోంది. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల జాబితాలను గ్రామసభల్లో బహిరంగంగా చర్చించి, అభ్యంతరాలు స్వీకరించి, నిజమైన అర్హులను గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. అలా చేస్తే అనర్హులకు ప్రయోజనం చేరిందా? అర్హులు మిగిలిపోయారా? అనే విషయాలు కూడా స్పష్టమయ్యే అవకాశం ఉంటుంది.

**ప్రశ్నిస్తే ఎందుకు భయం?**

ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ సమస్యలను ప్రశ్నించడం సహజం. తమకు పథకం ఎందుకు రాలేదని అడగడం తప్పు కాదు. అయితే ప్రశ్నించినప్పుడు కొందరు రాజకీయ నాయకులు లేదా వారి అనుచరుల నుంచి ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తే.. అది మరింత ఆందోళన కలిగించే అంశంగా మారుతుంది. పేదలు తమ సమస్యలను బహిరంగంగా చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడితే.. వారి బాధలు అధికారుల వరకు ఎలా చేరుతాయి? ప్రజల గొంతు వినిపించకపోతే సంక్షేమ పథకాల అమలులో లోపాలు ఎలా బయటపడతాయి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రశ్నించే వారిని అణచివేయడం కాదు.. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**గ్రామసభలే వేదిక కావాలి**

ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు గ్రామసభలు కీలక వేదికలు. అక్కడ ప్రతి కుటుంబానికి సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, అభివృద్ధి పనులు తదితర అంశాలపై బహిరంగంగా చర్చ జరగాలి. పేదలు తమ సమస్యలను ఎలాంటి భయం లేకుండా చెప్పుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు వాతావరణం కల్పించాలి. గ్రామసభలో వచ్చిన ఫిర్యాదులను కేవలం నమోదు చేయడం కాకుండా.. వాటిపై చర్యలు తీసుకుని ప్రజలకు సమాచారం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

**బయటకు రాని కన్నీటి కథలు**

గ్రామాల్లో ఎంతోమంది నిరుపేదలు తమ బాధలను బయటకు చెప్పుకోలేక మౌనంగా ఉంటున్నారు. ప్రభుత్వ పథకం కోసం దరఖాస్తు చేసుకుని నెలలు, సంవత్సరాలు ఎదురుచూసినా ఫలితం రాకపోయినా.. ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్న కుటుంబాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక పేద కుటుంబానికి ప్రభుత్వం అందించే ఇల్లు కేవలం ఒక నిర్మాణం కాదు.. వారి జీవితానికి ఒక భరోసా. ఒక పింఛన్ కేవలం కొంత నగదు కాదు.. వృద్ధుడికి జీవనాధారం. ఒక ఉపాధి అవకాశం కేవలం పని కాదు.. ఒక కుటుంబానికి అన్నం పెట్టే మార్గం. అందుకే సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**రాజకీయాలకు అతీతంగా సంక్షేమం అందాలి**

ప్రభుత్వ పథకాలు ప్రజల కోసం. అవి ఏ పార్టీకి చెందినవారికోసం కాదు. అధికారంలో ఉన్నవారిని అనుకూలించే వారికి మాత్రమే కాకుండా.. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సమానంగా అందాలి. రాజకీయ విభేదాలు, వ్యక్తిగత కక్షలు, స్థానిక వర్గ విభేదాలు సంక్షేమ పథకాల అమలుపై ప్రభావం చూపకూడదని ప్రజలు కోరుతున్నారు. అర్హత ఉన్నా పథకం రాకపోతే బాధితులు అధికారులను ఆశ్రయించే అవకాశం ఉండాలి. వారి ఫిర్యాదులను స్వీకరించి, విచారణ చేసి, వాస్తవ పరిస్థితిని తెలియజేయాలి. అదే ప్రజాస్వామ్య పరిపాలనకు నిదర్శనం.

**అధికారుల పరిశీలన అవసరం**

గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికపై సమగ్రంగా పరిశీలన జరిపి.. అర్హులైన వారు మిగిలిపోయారా? దరఖాస్తులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? ఏ కారణాలతో తిరస్కరించారు? అనే వివరాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. అలాగే పథకాలు అందలేదని ఫిర్యాదు చేసే ప్రజలకు సరైన మార్గదర్శకత్వం అందించాలి. సమస్య పరిష్కారం కాకపోతే పైస్థాయి అధికారులను ఆశ్రయించే అవకాశం కల్పించాలి.

**పేదల బతుకులు మారేదెన్నడో..?**

ఎన్నికల సమయంలో పేదల ఇళ్లకు వెళ్లి హామీలు ఇచ్చే నాయకులు.. ఎన్నికల తర్వాత కూడా అదే పేదల సమస్యలను గుర్తు పెట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఓటు అడిగే సమయంలో ప్రతి పేద కుటుంబం ముఖ్యం అయితే.. సంక్షేమ పథకం ఇచ్చే సమయంలో కూడా ప్రతి అర్హ కుటుంబం అంతే ముఖ్యం కావాలి. పేదల జీవితాల్లో మార్పు రావాలి.. ప్రభుత్వ పథకాలు వారి గడప దాటాలి.. ప్రశ్నించే హక్కుకు గౌరవం ఉండాలి.. అర్హత ఉన్నవారికి న్యాయం జరగాలి. బయటకు రాని బతుకులు ఎన్నో.. చెప్పుకోలేని బాధలు ఎన్నో.. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు ఎన్నో.. వారి కన్నీటి కథలు ఎప్పుడు ముగుస్తాయో తెలియదు.ప్రభుత్వ పథకాల కోసం ఎదురుచూస్తున్న పేదల కళ్లలో ఆశ ఎప్పుడు నెరవేరుతుంది..? ప్రశ్నిస్తే భయపడాల్సిన పరిస్థితి ఎప్పుడు తొలగుతుంది..? అర్హులైన ప్రతి నిరుపేదకు సంక్షేమ ఫలాలు ఎప్పుడు అందుతాయి..? పేదల బతుకులు మారేదెన్నడో..? ఈ ప్రశ్నలకు సమాధానం ఇచ్చే బాధ్యత పాలకులు, అధికారులు, ప్రజాప్రతినిధులదే. పేదల గడపకు సంక్షేమం చేరిన రోజే.. ప్రభుత్వ పథకాల అసలు లక్ష్యం నెరవేరిన రోజు అవుతుంది.

## హక్కుల కోసం పోరాటానికి సిద్ధం

– ఐక్య కార్యాచరణ సమితి.

**మందమర్రి,ఆగష్టు 23(ప్రజాజ్యోతి ):** ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని ఆటో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక పట్టణ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, రూ.వెయ్యి కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ప్రతి కార్మికుడికి ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో కార్మికుల ఉపాధి గణనీయంగా తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 18 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23 అర్ధరాత్రి నుంచి చేపట్టనున్న సమ్మెకు మందమర్రి, మంచిర్యాల జిల్లా ఆటో కార్మికులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రమాద బీమా కొనసాగించడంతో పాటు 15 ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగుతామని, అవసరమైతే శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతుల్లో చేపట్టే ప్రతి పోరాట కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నామని వారు స్పష్టం చేశారు.



## సింగరేణి కార్మిక సమస్యలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

**సంస్థ లాభాలు, బకాయిలను ప్రకటించి కార్మికుల వాటా చెల్లించాలి**

**సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ జనరల్ బాడీ సమావేశం**

**శ్రీరాంపూర్ కమిటీకి కన్వీనర్‌గా కామ్రేడ్ రామగిరి రామస్వామి**




**మంచిర్యాల, 23, ఆగస్టు (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ జనరల్ బాడీ సమావేశం సీసీసీ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు కామ్రేడ్ భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ అభివృద్ధికి గత రెండేళ్లుగా నిధులు కేటాయిస్తున్నప్పటికీ కార్మికుల రక్షణకు అవసరమైన పరికరాలను సకాలంలో సరఫరా చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. గుర్తింపు సంఘం సేఫ్టీ సమావేశాలు, యాజమాన్యంతో నిర్వహించే సమావేశాల్లో కార్మికుల భద్రతకు సంబంధించిన అంశాలను గట్టిగా ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. పరిష్కరించాల్సిన సమస్యలపై బాధ్యత వహించాల్సిన వారే ధర్నాలు చేస్తూ కార్మికులను మభ్యపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సంస్థకు వచ్చిన లాభాలు, బకాయిల వివరాలను వెంటనే ప్రకటించి కార్మికులకు రావాల్సిన వాటాను చెల్లించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ ఒంటరిగా సమ్మె నోటీసు ఇచ్చి చర్చలకు వెళ్లడం, విఫలమైతే సమ్మె చేస్తామని చెబుతూ కాలయాపన చేయడం కాకుండా అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని కార్మిక సమస్యలపై ఐక్య పోరాట కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితి ముగిసినందున యాజమాన్యం అన్ని కార్మిక సంఘాలను సమానంగా గుర్తించాలని కోరారు. సింగరేణిలో కార్మిక వ్యతిరేక నిబంధనలు అమలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా కార్మికులకు ఇబ్బందులు కలిగించే కొత్త నిబంధనలు తీసుకొస్తున్నప్పటికీ వాటిపై ఏఐటీయూసీ స్పందించకుండా కేవలం పైరవీలకే పరిమితం కావడం కార్మికులు గమనించాలని అన్నారు. ఇటీవల సర్ఫేస్‌కు వచ్చిన జనరల్ అసిస్టెంట్ల బేసిక్ ప్రొటెక్షన్‌కు సంబంధించి కోర్టు ఇచ్చిన తీర్పును ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్‌ను మరింత బలోపేతం చేయడంలో భాగంగా శ్రీరాంపూర్ కమిటీని 22 మందితో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా కామ్రేడ్ రామగిరి రామస్వామిని ఎన్నుకున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏ విధంగా ముందుకు సాగాలనే అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. 12వ వేతన సవరణ కమిటీ ఏర్పాటు కోసం జూలై 1న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎదుట, ఆగస్టు 10న సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన ధర్నాలతో పాటు సెప్టెంబర్ 12న రాంచీలో నాలుగు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సు నేపథ్యంలో కోల్ ఇండియా యాజమాన్యం స్పందించిందని తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2న యూనియన్లతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆ సమావేశంలో యాజమాన్యం స్పందనను బట్టి కార్మికులు భవిష్యత్ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం అనంతరం పలువురు కార్మికులు యూనియన్‌లో చేరారు. వివిధ గనుల నుంచి హాజరైన ఆఫీస్ బేరర్లు, కార్యకర్తలు కలిపి సుమారు 50 మంది ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఫ్లాష్ న్యూస్..




**కార్మిక సంఘాలతో.. ఈనెల 27న కీలక ఆన్లైన్ సమావేశం...**

**12వ వేతన ఒప్పందంపై చర్చించే అవకాశం...**

**మంచిర్యాల, 23, ఆగస్టు (ప్రజాజ్యోతి):** జాతీయ కార్మిక సంఘాలైన సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్ సంఘాలతో కోల్‌ఇండియా స్థాయిలో ఈనెల 27న కీలక ఆన్‌లైన్ సమావేశం జరగనున్నది. ఈ సమావేశంలో బొగ్గు గని కార్మికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కొత్త వేతనాలను నిర్ణయించే 12వ వేతన ఒప్పందంపై చర్చలు ప్రారంభించేందుకు నాలుగు కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు కీలకంగా చర్చించనున్నారు. అదేవిధంగా భవిష్యత్ కార్యాచరణపై కూడా కీలక నిర్ణయాలు తీసుకొని ఆమోదించే అవకాశాలున్నాయి. ఈ సమాచారానికి సంబంధించి వేజ్ బోర్డు మెంబర్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు వివరాలను వెల్లడించారు. 12వ వేతన ఒప్పందం కోసం వేతన చర్చలను త్వరగా ప్రారంభించడం, కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వ్యూహం, కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగడంపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం అన్ని జాతీయ కార్మిక సంఘాలతో కలిసి పోరాటాల రూపకల్పన కూడా చేయనున్నట్లు ఆయన ఆదివారం తెలిపారు. ఐక్యతే బలమని.. పోరాటమే అందరి గమ్యమని స్పష్టం చేశారు. ఇది కార్మిక సంఘాల ఐక్య పోరాటమే కాకుండా కార్మికుల విజయానికి దోహదపడే పోరాటమని అన్నారు. 12వ వేతన కమిటీ ఏర్పాటు దిశగా ముందడుగన్నారు . 12వ వేతన కమిటీ ఏర్పాటు దిశగా ముందడుగు పడటం హర్షణీయమని మంద నరసింహారావు అన్నారు. 12వ వేతన కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 1న, ఆగస్టు 10న కార్మిక సంఘాలు ఐక్యంగా నిర్వహించిన ఆందోళనలు ఫలితాన్నిచ్చాయని పేర్కొన్నారు. అలాగే సెప్టెంబర్ 12న రాంచీలో నిర్వహించనున్న కార్మిక సంఘాల సదస్సు నేపథ్యంలో కోల్‌ఇండియా యాజమాన్యం స్పందించినట్లు వివరించారు. సెప్టెంబర్ 2న అపెక్స్ జేసీసీ సమావేశం జరుగనున్నది .కోల్‌కతాలో సెప్టెంబర్ 2న అపెక్స్ జేసీసీ సమావేశాన్ని నిర్వహించేందుకు నాలుగు కేంద్ర కార్మిక సంఘాలతో చర్చలకు కోల్‌ఇండియా ఆహ్వానం పలకడం ఐక్య పోరాటానికి లభించిన తొలి ఫలితమని ఆయన అభిప్రాయపడ్డారు. 12వ వేతన ఒప్పందం అమలు కోసం కార్మిక సంఘాలు మరింత ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందం సాధన కోసం భవిష్యత్‌లో నిర్వహించే పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని మంద నరసింహారావు పిలుపునిచ్చారు. కార్మికుల ప్రయోజనాల సాధనలో కేంద్ర కార్మిక సంఘాల ఐక్యత మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు.

# జి.ఓ 97ను తక్షణమే రద్దు చేయాలి

**స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విద్యను విలీనం చేయొద్దు**

**ఇంటర్ బోర్డు తరహాలో పాలిటెక్నిక్‌కు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి**

**టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి కొమ్ముల ప్రవీణ్ రాజ్**



**మంచిర్యాల, 23, ఆగస్టు (ప్రజాజ్యోతి):** పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసేందుకు తీసుకొచ్చిన 97ను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి కొమ్ముల ప్రవీణ్ రాజ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది పాలిటెక్నిక్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యే కమైన ప్రాధాన్యత, విద్యా విధానం, సాంకేతిక నైపుణ్య శిక్షణ వ్యవస్థ ఉందని, దానిని స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వల్ల విద్యార్థుల విద్యా, ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ప్రవీణ్ రాజ్ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం 97ను పునఃపరిశీలించి వెంటనే రద్దు చేయాలని కోరారు.ముఖ్యంగా ప్రైవేట్ యూనివర్సిటీల పరిధిలో పాలిటెక్నిక్ విద్యను విలీనం చేయడం వల్ల విద్యార్థులకు అందుతున్న ప్రభుత్వ ప్రయోజనాలు, స్కాలర్‌షిప్‌లు, రిజర్వేషన్‌కు సంబంధించిన ప్రయోజనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఇతర విద్యా సదుపాయాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులపై ఈ నిర్ణయం ఆర్థిక భారాన్ని మోపే అవకాశం ఉందన్నారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయకుండా ప్రస్తుతం కొనసాగుతున్న విధానంలోనే కొనసాగించాల ని ప్రవీణ్ రాజ్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యకు మరింత మెరుగైన పరిపాలనా వ్యవస్థ అవసరమైతే, ఇంటర్మీడియట్ బోర్డు తరహాలో పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి, దాని పరిధిలో రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలలు, విద్యా వ్యవస్థను కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ కీలక సమస్యపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ విద్యార్థులకు అండగా ఉంటుందని ప్రవీణ్ రాజ్ స్పష్టం చేశారు. 97 రద్దు చేసే వరకు విద్యార్థుల పక్షాన పార్టీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల అభిప్రా యాలను పరిగణనలోకి తీసుకుని వారి భవిష్యత్తుకు అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. "ప్రభుత్వం తక్షణమే జి.ఓ 97ను రద్దు చేయాలి. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించే నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలి. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయకుండా ప్రత్యేక విద్యా వ్యవస్థను కొనసాగించాలి. అవసరమైతే ఇంటర్మీడియట్ బోర్డు తరహాలో పాలిటెక్నిక్‌కు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలి. +ూ 97 రద్దు చేసే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ పాలిటెక్నిక్ విద్యార్థులకు అండగా ఉంటుందని అన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి జి.ఓ 97ను రద్దు చేయాలని, లేనిపక్షంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో తదుపరి కార్యాచరణను ప్రకటించి విద్యార్థులతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# ఉద్యమకారులు ఆవేదన చెందకుండా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కాలయాపన చేయకుండా గుర్తింపు ఆన్లైన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించా లని డిమాండ్**

**లేనియెడల రాష్ట్ర ప్రభుత్వాన్ని అల్టిమేటం రాష్ట్ర ఉద్యమకారుల పక్షాన రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులతో కలిసి ఆందోళనాలు చేపడతాం:**

**దశలవారీగా నిరసన కార్యక్రమాలు మండల స్థాయిలో తహసిల్దార్ లకు,డివిజన్ స్థాయిలో ఆర్డీవోలకు,జిల్లా స్థాయి లో కలెక్టర్లకు,**

**రాష్ట్ర స్థాయిలో మంత్రులకు, సెక్రటేరియట్ స్థాయిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రలు సమర్పిస్తాం:**

**6వ దశలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున శాంతి యుత నిరసన ఆందోళనలు చేస్తాం:**

**ఉద్యమకారులు ఐక్యమత్యంతో ముందుకు రావాలి ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షులు తోడేటి శంకర్ గౌడ్:**

**ఆగస్ట్ 23, సిర్పూర్ (టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని తెలంగాణ ఉద్యమకారుల సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షులు తోడేటి శంకర్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ఉద్యమకారులు ఆవేదన చెందకుండా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఉద్యమకారుల గుర్తింపులో జాప్యం చేయకుండా ఆన్లైన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వాన్ని (అల్టిమేటం) ప్రకటించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే దశలవారీగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ఉద్యమకారులతో కలిసి దశలవారీగా ఆందోళన నిరసన కార్యక్రమాలు చేపట్టి వినతి పత్రాలు సమర్పించడం జరుగు తుందని ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షులు తోలేటి శంకర్ గౌడ్ అన్నారు. మొదటి దశలో మండల స్థాయిలో తాసిహల్దార్ లకు, 2వ దశలో నియోజక వర్గ స్థాయిలో ఆర్డీవోలకు, 3వ దశల్లో జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్లకు,4వ దశలో మంత్రులకు,ఎమ్మెల్యే లకు,5వ దశలో సెక్రటేరియట్ రాష్ట్ర ముఖ్యమంత్రి కి సెక్రెటకు ఉద్యమకారుల సమస్య లు పరిష్కరించాలని వినతి పత్రలు అంద జేయడం జరుగు తుందని అన్నారు. ఎప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే 6వ దశలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తు న ఉద్యమ కారులతో కలిసి నిరసన, ఆందోళనలు ధర్నాను ముమ్మరం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉద్యమ కారుల కమిటీ వెంటనే చర్యలు తీసుకొని ఆన్లైన్ ప్రక్రియను ప్రారంభించి ఉద్యమకారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని తోడేటి శంకర్ గా డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు దశలవారీగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు వివిధ సొసైటీ లకు అనుగుణంగా ఐక్యమత్యం ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులను గుర్తించి, ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు వెంటనే అందజేయాలని అన్నారు. అదేవిధంగా 250 గజాల ఇంటి స్థలం కేటాయించి 4 గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఉద్యమకారు లకు ప్రతి నెల ప్రతి నెల 50 వేల పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఉద్యమ కారుల పిల్లలకు ఉచిత విద్యా అందించాలని సూచించారు. ఉద్యమ కారుల కుటుంబాలకు 25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బస్సులలో, రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం బస్సు, రైల్వే పాస్ లు అందజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాల ను తెగించి పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని అన్నారు. ఉద్యమకారుల త్యాగా లను మరువవద్దని అన్నారు. 2001 2013 మధ్య తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని కేసులు నమోదైన ఉద్యమకారు లను వెంటనే గుర్తించా లని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమస్యల పరిష్కారించ డంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి ఉద్యమ కారులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేకమంది ఉద్యమాలు చేసి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని జైలు జీవితాలను సైతం అనుభవించారని వారి త్యాగాలు పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లు గడిచిన ఉద్యమకారు లకు గత ప్రభుత్వాలు గానీ, ప్రస్తుత ప్రభుత్వం గానీ తగిన గుర్తింపు, గౌరవం, ఆర్థిక సాయం అందించలేదని దీంతో తెలంగాణ ఉద్యమ కారులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. ప్రస్తుత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు పలు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచిన హామీలు అమలుపై ప్రభుత్వం తగిన స్పష్టమైన చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ లను రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు తెలంగాణ ఉద్యమ సంఘాలు ఏర్పడ్డాయని అన్నారు.ఉద్యమ కారుల సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు నిర్వహిస్తున్నాయని అన్నారు. ఈ పోరాటల ఫలితంగానే ఉద్యమ కారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ప్రకటించి ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేశారని అయితే ఈ కమిటీ పేరుతో కాలయాపన జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన ఉద్యమకారుల కమిటీ నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే ఉద్యమ కారుల గుర్తింపు ప్రక్రియ మొదలు చేసి గుర్తింపు కార్డులు అందజేసి ప్రభుత్వపరంగా ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఉద్యమ కారుల పక్షాన తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షులు తోలేటి శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.




# గూడెం గుట్టపై భక్తజన సందోహం



**-శ్రావణ శుద్ధ ఏకాదశి పూజల్లో 154 జంటలు** దండేపల్లి,ఆగష్టు 23(ప్రజాజ్యోతి): దండేపల్లి మండలం గూడెం గుట్ట శ్రీ సత్యనారాయ ణ స్వామి దేవస్థానంలో శ్రావణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. శ్రావణ మాసంలో అత్యంత పవిత్రమైన ఏకాదశి పర్వదినం అలాగే ఆదివారం సెలవు కావడంతో కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా ఆలయానికి తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు

**ప్రత్యేక ఏర్పాట్లు**

వ్రతాలు చేసుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. శ్రావణ ఏకాదశి సందర్భంగా మొత్తం 154 జంటలు శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# బంబార ప్రధాన రహదారికి 'డ్రెయిన్' దెబ్బ

## బురదలో సాగుతున్న రాకపోకలు తవ్విన మట్టి తొలగింపులో నిర్లక్ష్యమే సమస్యకు కారణమా?

## ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు జారిపడినట్లు స్థానికులఆరోపణలు

## పనులు ఒకచోట.. ఇబ్బందులు మరోచోట.. అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని డిమాండ్








**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు 23 (ప్రజాజ్యోతి):** అభివృద్ధి పనులు చేపట్టారు.. కానీ వాటి ప్రభావం ప్రధాన రహదారిపై పడింది. సైడ్ డ్రెయిన్ నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకాలతో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టి, వర్షానికి రహదారిపైకి చేరడంతో బంబార ప్రధాన రహదారి బురదమయంగా మారుతోంది. ఫలితంగా నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంబార గ్రామపంచాయతీ పరిధిలోని ఈ రహదారి గ్రామానికి ప్రధాన రాకపోకల మార్గం. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, వ్యాపారులు నిత్యం ఈ మార్గాన్ని వినియోగిస్తుంటారు. ప్రస్తుతం రహదారిపై మట్టి పేరుకుపోవడం, వర్షం కురిసినప్పుడు అదే మట్టి బురదగా మారడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

### డ్రెయిన్ పనులు.. రోడ్డుపై మట్టి

సైడ్ డ్రెయిన్ నిర్మాణం కోసం రహదారికి ఇరువైపులా తవ్వకాలు చేపట్టారు. సాధారణంగా ఇలాంటి పనుల్లో తవ్విన మట్టిని రహదారికి దూరంగా తరలించడం, వర్షపు నీటితో అది రోడ్డుపైకి చేరకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. అయితే బంబారలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. తవ్విన మట్టి రహదారి పరిసరాల్లోనే ఉండిపోవడంతో వర్షం కురిసినప్పుడు మట్టి కొట్టుకొచ్చి ప్రధాన రహదారిపై పేరుకుపోతోందని వారు అంటున్నారు. దీంతో డ్రెయిన్ నిర్మాణం పూర్తయ్యేలోపే రహదారి వినియోగదారులకు కొత్త సమస్య ఎదురవుతోందని పేర్కొంటున్నారు.

### బురదలో ద్విచక్ర వాహనాల ప్రయాణం

రహదారిపై బురద ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బురదలో టైర్లు జారే అవకాశం ఉండటంతో వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాల్సి వస్తోంది. వాహనాన్ని అదుపులో ఉంచుకునేందుకు రహదారిపై అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు.ఇప్పటికే సుమారు ఎనిమిది మంది వరకు ద్విచక్ర వాహనదారులు జారిపడినట్లు గ్రామస్థులు తెలిపారు. పెద్ద ప్రమాదాలు జరగకపోయినా, వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం రహదారి పరిస్థితిపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సూచిస్తోందని వారు అంటున్నారు.

### రహదారి సమస్య.. కేవలం వర్షాకాలానికేనా?

వర్షం వచ్చినప్పుడే సమస్య కనిపిస్తుందని భావించకుండా, తవ్వకాల తర్వాత రహదారిపై మట్టి ఎందుకు పేరుకుపోతోందన్న అంశాన్ని అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షం పడినప్పుడు మట్టి రోడ్డుపైకి చేరే పరిస్థితి ముందుగానే అంచనా వేసి ఉంటే తాత్కాలిక చర్యలతో సమస్యను నివారించే అవకాశం ఉండేదని చెబుతున్నారు.డ్రెయిన్ నిర్మాణం వల్ల భవిష్యత్తులో వర్షపు నీటి సమస్యకు పరిష్కారం లభించవచ్చని, అయితే నిర్మాణ దశలో రహదారి వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

### పనుల పర్యవేక్షణపై ప్రశ్నలు

నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో రహదారి పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలిస్తున్నారా? తవ్విన మట్టి రహదారిపైకి చేరకుండా చర్యలు తీసుకున్నారా? వర్షం తర్వాత ఏర్పడిన పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. పనులు మంజూరు చేయడం, ప్రారంభించడం మాత్రమే కాకుండా.. అవి పూర్తయ్యే వరకు ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను పర్యవేక్షించడం కూడా అధికారుల బాధ్యత అని గ్రామస్థులు అంటున్నారు.పాదచారులకూ ఇబ్బందే రహదారిపై బురద ఉండటంతో పాదచారుల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రహదారి పక్కన డ్రెయిన్ కోసం తవ్వకాలు ఉండటంతో పాదచారులు సురక్షితంగా నడిచేందుకు స్థలం తగ్గిందని స్థానికులు తెలిపారు.విద్యార్థులు, మహిళలు, వృద్ధులు రాకపోకలు సాగించే సమయంలో ప్రత్యేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. వాహనాలు, పాదచారులు ఒకే మార్గంలో వెళ్లాల్సి రావడంతో రద్దీ సమయాల్లో సమస్య మరింత స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు.

### రాత్రి వేళల్లో జాగ్రత్త అవసరం

రాత్రి సమయంలో రహదారిపై బురదను గుర్తించడం కష్టంగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు మరింత జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోంది. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. డ్రెయిన్ పనులు పూర్తయ్యే వరకు రహదారి భద్రతకు తాత్కాలిక చర్యలు తీసుకుంటే సమస్యను కొంతవరకు నియంత్రించవచ్చని చెబుతున్నారు. పని పూర్తయ్యే వరకు రోడ్డు ఎవరిది?' డ్రెయిన్ నిర్మాణం జరుగుతోంది.. రహదారి ప్రజల వినియోగంలోనే ఉంది. ఈ రెండు పనులు ఒకేసారి కొనసాగుతున్నప్పుడు ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ప్రణాళిక అవసరం. తవ్విన మట్టి రహదారిపైకి చేరకుండా చూడటం, వర్షపు నీటిని మళ్లించడం, రహదారిని అవసరమైనప్పుడు చదును చేయడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉందని స్థానికులు సూచిస్తున్నారు. అభివృద్ధి పనుల వల్ల తాత్కాలిక ఇబ్బందులు తప్పవని భావించినా, అవే ఇబ్బందులు ప్రమాదాలకు దారితీయకుండా అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

### తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత పరిష్కారం

ప్రస్తుతం రహదారిపై ఉన్న మట్టి, బురదను తొలగించడం తక్షణ అవసరమని గ్రామస్థులు చెబుతున్నారు. అవసరమైన ప్రాంతాల్లో కంకర లేదా మెటల్ వేసి రహదారిని తాత్కాలికంగా ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని కోరుతున్నారు. అదే సమయంలో సైడ్ డ్రెయిన్ నిర్మాణాన్ని పూర్తి చేసి, వర్షపు నీరు రహదారిపైకి చేరకుండా డ్రెయిన్ వ్యవస్థను సక్రమంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పనులు పూర్తయ్యే సమయంలో రహదారిని కూడా పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కోరుతున్నారు.ప్రమాదం తర్వాత స్పందించే పరిస్థితి వద్దు ఇప్పటికే పలువురు జారిపడినట్లు స్థానికులు చెబుతున్న నేపథ్యంలో సమస్యను ముందుగానే పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కారణాలను వెతకడం కంటే, ప్రమాదానికి దారితీసే పరిస్థితులను ముందుగానే తొలగించడం సమర్థవంతమైన చర్య అవుతుందని పేర్కొంటున్నారు. బంబార ప్రధాన రహదారి పరిస్థితిని సంబంధిత అధికారులు స్వయంగా పరిశీలించి, మట్టి తొలగింపు, బురద నివారణ, డ్రెయిన్ పనుల పర్యవేక్షణ, రహదారి పునరుద్ధరణపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అభివృద్ధి పనులు ఆగాలని బంబార ప్రజలు కోరడం లేదు. పనులు కొనసాగుతూనే ప్రజలకు రాకపోకల ఇబ్బందులు లేకుండా చూడాలన్నదే వారి ప్రధాన డిమాండ్. డ్రెయిన్ పనులను నాణ్యతతో పూర్తి చేయడంతో పాటు, రహదారిపై పేరుకుపోయిన మట్టి--బురదను తొలగించి సురక్షిత రాకపోకలకు మార్గం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# వైభవంగా ఆడే గజేందర్ జన్మదిన వేడుకలు





**నేరడిగొండ ఆగస్టు 23 (ప్రజాజ్యోతి ):**మండల కేంద్రంలోని సూర్య గార్డెన్స్ లో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ జన్మదిన వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల సమక్షంలో గజేందర్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. బోథ్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో సూర్య గార్డెన్స్ ప్రాంగణం కాంగ్రెస్ జెండాలు, నినాదాలతో హోరెత్తింది. కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకు లు ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆడే గజేందర్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు నాయకులు కొనియాడారు. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, ఆదిలాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, ఇచ్చోడ బ్లాక్ ఆత్మ చైర్మన్ కౌడల నారాయణ, ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సత్యవతి కోటేశ్వర్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, తిత్రే నారాయణ్ సింగ్, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఏలేటి మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు కళ్యెం నారాయణ రెడ్డి, మెరుగు భోజన్న, గాజుల పోతన్న, కళ్యెం విఠల్, కంచం లక్ష్మణ్, దౌలత్ రావు, కౌడల సంతోష్, కాసుల ప్రతాప్, దండే సుదర్శన్ లతో పాటు వివిధ మండలాల సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, పాక్స్ చైర్మన్లు, మార్కెట్ డైరెక్టర్లు, ఆత్మ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జిల్లా అధ్యక్షులుగా గేడం టీకానంద్




**జిల్లా కార్యదర్శిగా దుర్గం రాజ్ కుమార్,, కోశాధికారిగా దుర్గం నిఖిల్, ఉపాధ్యక్షులు గా, ఆత్మకూరి సతీష్, వడ్లూరి శ్రీకాంత్, సహాయ కార్యదర్శులు గా,చాపిడి పురుషోత్తం కుందరపు మంజుల**

**డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి గోడిసెల కార్తీక్:**









**ఆగస్టు23,సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ ) 4వ మహా సభలు ఆసిఫాబాద్ పట్టణంలో రోజ్ గార్డెన్‌లో రెండు రోజులపాటు తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి గోడిసెల కార్తీక్ అధ్యక్షతన అట్ట హాసంగా నిర్వహించు కోవడం జరిగిందని తెలిపారు. ఈ మహా సభలో డివైఎఫ్ఐ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు అందులో భా గంగా జిల్లా అధ్యక్షులుగా గేడం టికానంద్,జిల్లా కార్యదర్శిగా దుర్గం రాజ్ కుమార్,జిల్లా కోశాధికారి దుర్గం నిఖిల్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఆత్మకూరి సతీష్, వడ్లురి శ్రీకాంత్,జిల్లా సహాయకార్యదర్శిలుగా చాపిడి పురుషోత్తం,కుందరపు మంజుల జిల్లా కమిటీ సభ్యులుగా డోంగ్రి గజానంద్, తాళ్ల పల్లి రాజేష్,సుంకె ప్రవీణ్ నైత్తం దత్తు,పాల్తె కార్తీక్, కొబ్రగడే ఉదయ్,దుర్గం అఖిల, నిరోషలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని సమస్యల పై, జిల్లాలోని ప్రజలకు విద్యా వైద్యం, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి సాధించుకోవడానికి ఈ నూతన కార్యవర్గం పనిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి గోడిసెల కార్తీక్ తెలిపారు.

## బాసరలో 1043 అక్షరాభ్యాసాలు



**బాసర ఆగస్టు 23 (ప్రజా జ్యోతి)** బాసర మూలా నక్షత్రం ఆదివారం ఏకాదశి అమ్మవారి నక్షత్రం కలిసి రావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు వేకువ జాము నుంచి పవిత్ర గోదావరి నది పుణ్యస్నానాలు ఆచరించి అక్షరాభ్యాసం కొరకు భక్తులు క్యూ లైన్ లలో భక్తులు బారులు తీరారు మూలా నక్షత్రం కలిసి రావడంతో బాసర అమ్మవారి సన్నిధిలో 1043 అక్షరాభ్యాసాలు జరిగాయి భక్తులు తమ చిన్నారులు అమ్మవారి చెంత అక్షర శ్రీ కర పూజలు జరిపించి అమ్మవారి దర్శనం చేసుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు సుమారు అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం కావడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బొలెరో వాహనం.. తప్పిన పెను ప్రమాదం



**సోన్, ఆగస్టు 23(ప్రజా జ్యోతి):**సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో ఆదివారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం 44వ జాతీయ రహదారి నుంచి కడ్తాల్ గ్రామంలోని సర్వీస్ రోడ్డుపైకి అదుపుతప్పి బోల్తాపడి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 11 కేవీ విద్యుత్ స్తంభం ధ్వంసమైంది. బొలెరో వాహనం టైరు ఊడిపోయి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో దాని వెనుక భాగం కూడా దెబ్బతిన్నది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని వాహనం ఢీకొట్టిన విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు వెంటనే అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.